


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -156-

**(4 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఇటీవల ఒక కుర్రాడికి** సంబంధం చూడటానికి వచ్చిన పెద్దలు “పెళ్ళికూతురికి సంగీతం వచ్చా?” అని ప్రశ్నించారు. ఇది చాలాకాలం నుంచి ఆచారంలో వున్న ప్రశ్నేననుకోండి. ఇంకా ఆ ఆచారం అలాగే వస్తోంది.

వెంటనే అక్కడున్న ఒక పెద్ద మనిషి అన్నాడు. "గీత బాగుంటే సంగీతానికేంలెండి బాగున్నవాళ్ళు ఏమాట సాగదీసినా సంగీతంలాగానే వుంటుంది. ఇవతలివాళ్ళు తాళం వేసి తన్మయత్వంలో పడిపోతూ వుంటారు. గీత బాగుండకపోతే ఎంత సంగీతం వచ్చి మాత్రం ఏం లాభం. కేవలం అరణ్య రోదన" అని.

అక్కడున్న తక్కిన వాళ్ళు ఆయన వ్యాఖ్యానానికి కొంతవరకు విస్తుపోయిన మాట నిజమే. కాని ఒకాయనకు మాత్రం కొంచెం కోపం వచ్చినట్లుంది ఇలా ప్రారంభించాడు.

"సంగీతంలో వుండే ప్రభావం మీకు తెలియదల్లే వుంది. సంగీతం జీవన దాత. ఆనంద ప్రదాయిని. అలాటి సంగీతానికి ప్రాధానమివ్వకపోతే దేనికి ఇవ్వడం? నిత్య జీవితంలో సంగీతం ఎంతో ఉపయోగిస్తుంది. జీవితాన్ని ఉద్ధరిస్తుంది.

అసలు సంగీతానికిచ్చినంత స్థానం దేనికీ ఇవ్వక్కర్లేదు. అందువల్ల పెళ్ళి కూతురికి సంగీతం వచ్చా అని అడిగాం.. తప్పేం వుంది? మీరన్నట్లు గీత బాగున్నా, బాగుండకపోయినా సంగీతంతో జీవించవచ్చు. చివరకు స్ట్రీట్ సింగర్సుగానన్నా బ్రతకవచ్చు" అన్నాడాయన.

"అంతదూరం మేము ఆలోచించలేదండీ. సంసారాలలో సంగీతం ఆలపిస్తూ కూర్చునేటంత అవకాశాలు లేవుకదా ఈ రోజుల్లో. మనస్సులో శాంతి వుంటేనేగా సంగీతం. మనస్సులో శాంతి ఉండాలంటే ఇంట్లో శాంతి ఉండాలి. ఇంట్లో వుండాలంటే పర్సు కొంచెం బరువుగా వుండాలి. సంగీతం డొల్ల కడుపులోంచి, మెల్ల చూపుల్లోనుంచీ, అల్లిలీకేరల్లోనుంచీ వస్తుందా చెప్పండి?" అన్నాడు మొదటి పెద్ద మనిషి.

మొత్తం మీద పెళ్ళిళ్ళ సమయంలో పెళ్ళి కుమార్తెకు సంగీతం వచ్చా? రాదా? అనే ప్రశ్న వేస్తూనే వుంటారు వెనుకటికి ఒక ఇంట్లో మెల్ల పెళ్ళికూతురు వుందట. చాలామంది వచ్చి చూసి పారిపోతున్నారట. చివరకు ఒక సంబంధం తాలుకు పెద్ద మనిషి అమ్మాయికి సంగీతం వచ్చా అని అడిగాడట.

వచ్చు అని చెప్పారు. ఆ అమ్మాయి ఆనాటి ఆచారం ప్రకారం తలవంచుకునుని కూర్చుని ఆధ్యాత్మరామాయణంలో కీర్తన ఒకటి అద్భుతంగా పాడేసిందిట. పెళ్ళిచూపులకు వచ్చినవారు ఉప్పొంగిపోయారుట. వారికో ఒకామె వెళ్ళి పెళ్ళి కూతురు తలపైకెత్తి "ఇంత సంగీతం నీలో వుంది మా కింకేం కావాలమ్మా. మా జన్మలు ధన్యమవుతాయి" అందిట. అప్పుడు మెల్లకన్ను ఆమె కంట పడిందిట. "మెల్ల అయితే మాత్రం ఏం తల్లీ నువ్వు పాడుతుంటే తెల్లని వెన్నల కురుస్తుంది మీ యింట్లో" అని సగర్వంగా పలికి ఆ పిల్లనే ఖాయం చేసుకున్నారుట.

అలా కేవలం సంగీతానికి పొంగి లొంగిపోయే వారు ఈ కాలంలో ఎక్కడన్నా వున్నారా? అనేది ప్రశ్న. ఏ లతామంగేష్కర్ వంటి గాయకురాలో అయితే తప్ప గానానికి మెచ్చి సంబంధం కలుపుకోవడం అంటూ వుండదు.

పరీక్షకు వెళ్ళేవాళ్ళు వివిధమైన సబ్జెక్ట్స్ చదువుకుని సిద్దపడుతున్నట్లు పెళ్ళికావలసిన పిల్లలకు సంగీతాధ్యయం కూడా తప్పడంలేదు. ఒక అమ్మాయికి గొంతులో సంగీతపు జీర ఎంత మాత్రం లేకపోయినా కొంత కాలం చెప్పించారట.

కొంతకాలానికి పెళ్ళి చూపులకు ఎవరో వచ్చారుట. సరే మాములు ప్రకారం సంగీతం వచ్చా అని అడిగారట. పిల్ల మేనత్త వెంట ఒక పాత హార్మోనియం తెచ్చి అక్కడ పెట్టిందిట. ఆ అమ్మాయికి వాయించటం రాదు .అందువల్ల మెల్లగా శ్రుతి చేసుకుంటూ –

"పతియే... పతియే...
పతియే.. దైవం
సతులకు ...తులకు
సతతము...సతతము
పతియే...పతియే
పతియే...పతియే
పతియే – దైవం
పదములు..పదములు
వదలను..వదలను
పతియే...పతియే
పతియే...దైవం...

అని బొంగురు గొంతుకతో కాలిమీద గట్టిగా తాళం వేసుకుంటూ పాడటం ప్రారంభించిందిట.

ఆ పాట విని పెళ్ళికుమారుడు చివాలున లేచి వెళ్ళి వాకిట్లో వున్న పాతకారు ఎక్కి కూరున్నాడుట. తక్కినవారు కూడా బయలుదేరారుట. పెళ్ళి కుమార్తె తల్లిదండ్రులు "ఏమండీ పిల్ల నచ్చిందా?" అని అడిగారుట.

అంతా కారు దగ్గరకు వెళ్ళి పెళ్ళి కుమారుణ్ణి అడిగారుట. "ఏ మాటా చెప్పకుండా వచ్చావేమిటి? పిల్ల నచ్చిందా?" అని అడిగారంట.

"పిల్ల నచ్చడం మాట దైవానికెరుక. ఆవిడ పతిభక్తికి భయపడి పారిపోయి వచ్చాను. అంత భక్తి అయితే ఎలా పాదాలే వదలదట. ఇంకా ఆఫీసుకు వెళ్ళేదెలా? నేను కొద్దిపాటి ఉద్యోగిని నాకు కుదరదా పద్ధతి" అని.

“అది పాటలో భక్తిలెండి. దానికిమీరంత భయపడితే ఎలా? పిల్ల మీకు నచ్చితే ఆ పాట మానిపించి వేస్తాం మీరేది పాడమంటే అదే పాడుతుంది” అన్నారుట పిల్ల తండ్రి.

"ఆ పాటే కాదండీ. సంగీతం పాడనని ప్రతిజ్ఞ చెయ్యాలి. అలా అయితే ఆలోచించి ఉత్తరం వ్రాస్తాం" అన్నాడట. ఏం చేస్తారు పాపం, ఆ తల్లిదండ్రులు దానికి కూడా అంగీకరించారంట.

కొన్ని కొన్ని సందర్భాలలో పెళ్ళి సంగీతాల నుంచి ఇలాటి తమాషాలు కూడా పుట్టుకు వస్తూ వుంటాయి. ఉబలాటం కొద్దీ చెప్పించిన సంగీతాల ద్వారా ఇలాటి గాబరాలు ఏర్పడుతూ వుంటాయి.

కొందరు పెళ్ళి కుమారుళ్ళక్కూడా సంగీతం వచ్చి వుంటుంది. ఈ రోజుల్లో రావడానికేం వుంది. ప్రతివాళ్ళూ సినిమా పాటలు బట్టీ పట్టి పాడేస్తున్నారు కదా!

ఇటీవల ఒక కుర్రవాడు పిల్లను చూడటానికి వెళ్ళి "నీకు డ్యూయెట్లు పాడటం వచ్చా?" అని అడిగాడుట.

"ఇటీవల తెలుగు హిందీ చిత్రాలలో ఏదైనా సరే రెడీ" అందిట ఆ అమ్మాయి.

అతగాడు వెంటనే ప్రారంభించాడుట.

"కాదంబరి, జగదీశ్వరి! రాజేశ్వరి, ఇకనైనా కరుణించవే"

ఆమె క్షణం కూడా ఆలోచించకుండా, చక్కటి స్థాయిలో తన పోర్షన్ అందుకుని

"నీ మొరలన్నీ నే విన్నాను. నీ అండగ నే వున్నాను."

అది విని అతగాడు ఉప్పొంగిపోయి “అండగా వుంటానన్నావుగా ఉండు. పర్మనెంటుగా ఉండు. నా జీవితం ఇక చెండు.. నీలో అందం మెండు" అని తల్లితండ్రుల వంక చూసి "సంబంధం ఓకే" అని ఒక్క గావుకేక పెట్టాడుట.

Post your comments